
కథ



# వెండి కుంకుమ భరిణ

## మునిపల్లె రాజు

స్వగ్రామంలో ఇల్లూ, వాకిలీ తెగనమ్ముకొని పోయిన జగన్‌తో, నా స్నేహానికి పది పన్నెండేళ్ల గ్రహణం పట్టింది. కనీసం పోస్టుకార్డు ముక్కల్తో పలకరింపులు గూడా కరువైపోయినవి. పారిశ్రామిక యుగం దాపురించిన తర్వాత, ఈ మహా పట్నాల్లోని మారుమూలల కార్ఖానాల్లో పది అంతస్థుల మేడల ఆఫీసుల్లో, బాల్య స్నేహితుల్ని కనుక్కోవటం నావంటి సామాన్యుడికి ఎంత కష్టసాధ్యం? అయితే కర్ణాకర్ణిగా వినవచ్చిన వార్తల్లో వాడేదో ఢిల్లీ పరీక్షలు రాసి, పెద్ద పోలీసు ఉద్యోగిగా ఎక్కడో ఉన్నాడని తెలుస్తోంది. ఎంతో ఆనందించాను.

అడుగో, ఆ పెద్ద మనిషి -మబ్బులేని వర్షంలాగా వూడివడి, తొలి రూపాలు ఆవిర్భవిస్తున్న బట్టతలతో గుర్తించలేనంతగా మారిపోయి, యీ పదేళ్ల మౌనానికి కారణాలేమీ విశదీకరించకుండానే, ఏవేవో పోలీసు కబుర్లు, కథలు చెబుతున్నాడు. నా అర్ధాంగి వూళ్లోలేదు. నాది స్వతంత్రమైన లఘు వ్యాపారం. బోలెడు తీరిక.

మునిమాపువేళ -మంద్రగతిలో పూర్ణ యామినిగా రూపుదాల్చుకుంటున్నవేళ నక్షత్రాల దూరపు వెలుగు హాయిలో డాబామీద కూర్చొని నాకీ కథ చెప్పటం ప్రారంభించాడు జగన్. పొరుగింటి పారిజాతం పొదనుండి సువాసనల అలలు పరుచుకుంటున్నవి.

***

"నీవు చెబుతుంటావే కలోనియల్ టైప్ మధ్యతరగతి వారి సున్నపు డాబా ఇళ్లని. పెళ్లలు పెళ్లలుగా వూడి వస్తున్న గోడ పెచ్చులకు కొత్త సున్నం పూతగాని, మరామత్తులుగాని నోచుకోని ఆ డాబా పేద ముత్తయిదువు బోసి మెడలాగా వుంది.

అటువంటి ఇళ్లకు పై అంతస్తు పేరుతో, ఒకే ఒక్క గది వుంటుంది గదా. దానికి మెట్లు ఇంటిగోడ కానుకొనే గదా నిర్మించేది. ఎండకి తట్టుకొని, వానల్లో పాచిపట్టి, సన్నటి గడ్డి మొలకలు అంకురించి, మళ్లీ ఎండి, గరుకుగా కాళ్లకు తగిలే మెట్లు మనం ఎన్ని చూడటం లేదు?

ఆ గదిని అద్దెకు మాట్లాడుకోటానికి వచ్చాడు. అనంతం అనే యువకుడు. మెట్లెక్కుతున్నప్పుడు. ఇంటి ఇల్లాలు చేస్తున్న అష్టోత్తర శత నామావళి పూజ మంగళ ప్రదంగా వినిపించింది. శుభసూచకం అనుకొన్నాడు. మరునాడు తన పెట్టె, బెడ్డింగు, పుస్తకాలు చేరవేస్తున్నప్పుడు, ఆ మెట్లకిందినుంచే ఏడుపులు, పెడబొబ్బలూ విన్నాడు. మానవుడు ఎంత అవివేకి? జీవితం ద్వంద్వాతీతం అని ఎందుకు భ్రమిస్తాడో తెలీదు.

నిన్న ఎవరి గళం విప్పారినప్పుడో వెలువడింది- మధురగేయం, నేడు ఎవరి క్షుభిత హృదయం స్రవిస్తున్నదో యీ మానని గాయం, ఖిన్నుడై మెట్లమీద నిలబడిపోయాడు. ఇంటివారి పనిమనిషి కాబోలు. ముసలమ్మ వచ్చి పలకరిస్తే వులిక్కిపడ్డాడు.

"గది తుడిచేందుకు, అంట్లు తోమేటందుకు, బట్టలుతికేటందుకు పది రూపాయలు ఎక్కువ అడిగితినా బాబూగారూ?" అంటున్నది.

"నువ్వు కనబడిందెప్పుడు. నేనన్నదెప్పుడు?" అని తను ఆశ్చర్యపోయాడు.

ఆశ్చర్యంతోనే ఆ వృద్ధురాలి ముఖాన్ని పరికించాడు. జీవకళ మందగిస్తూన్న ఆమె నయనాల్లో పెంకితనంగాదు తను కనుగొన్నది. నిన్నటి ప్రార్థన. నేటి శోకమూ. ఒకే గళంనుంచి వచ్చిన వ్యథాకలిత జీవన గాథ కాదా- అన్న తన ఆంతరంగిక ప్రశ్నకు 'అవును' అని ఆమె మౌనంగా, కళ్లతోనే జవాబు చెబుతున్నదో, లేక, తను మానువలె మెట్లమీద నిల్చుండిపోతే, తన ఆందోళనను చల్లార్చేందుకో ఆ వక్ర ప్రశ్నలు? చేత చీపురుతో ఆమె మెట్లెక్కుతుంటే తనూ అనుసరించి గదిలో ప్రవేశించాడు.

ఇల్లుగల ప్లీడరుగారు, వీధి గోడన వేళ్లాడుతున్న ఆయన పేరు చూపిస్తున్న బోర్డు లాగానే వృద్ధాప్యంలో పడ్డాడు. సంపాదన, ఓపిక క్షీణించిపోయాయి. రెండో వివాహం చేసుకొని దుఃఖం కొని తెచ్చుకున్నాడు. సవతి తల్లి ఆరడిలో, ఆయన మొదటి భార్య కూతురు పెరుగుతున్నది. పోనీ, కన్యాదానం చేసి విరగడ చేసుకుందామని ప్లీడరుగారు ఆలోచించినా ఆమె పడనియ్యదు. మరి ఆ పిల్ల మేనమామలు, తల్లి పుట్టింటి వారెవరూ లేరా? వున్నారు- మేనమామలిద్దరు. కడుపేదలు, తమ వెతలకు ఇంకో తోడు కొని తెచ్చుకొంటారా? ముసలమ్మ మాటలు వింటూ, ఎవరి బాధాతప్త దూతగానో తనీయింట్లో ప్రవేశించింది. అనే వ్యాకులతకు నిర్గుణరూపం పోయి సగుణాకారం లభించిందని తలపోశాడు.

**మునిపల్లె రాజు కథలు తాత్త్విక చింతనతో కూడి ఆలోచింప జేస్తాయి. 'వెండి కుంకుమ భరిణ' అనే ఈ కథ ఆయన కథాశైలికి మచ్చుతునకగా నిలుస్తుంది.**

ఈ సగుణాకారం-నిత్యమూ వెతలతో, వేదనతో అవమాన పరంపరతో -ఆత్మహత్యకు తలపడితే? ఎందుకొచ్చింది తనకీ అనుమానం? ఒక నిండు ప్రాణం. ఒక యౌవన జీవితం. అశక్తుడైన తండ్రి. అనాసక్తులైన ఇరుగుపొరుగు. జాలిపడే జవసత్వాలుడిగిన పనిమనిషి. దయగల తను- అనంతం.

అద్దె చెల్లిస్తూనే, ఆ ముసలాయనతో ఈ విషయం కదిపితేనో అని అనుకోకపోలేదు. ఏ వస్తువుమీద కేంద్రీకరించలేని, నిస్తేజమైన ఆయన కళ్లు చూసి తన మాట తన గుండెలోనే నిలిచిపోయింది. విషవలయం అంటే యిదేనా? కబోది సమాజం అంటే దాని రూపం యిట్లాగే వుంటుందా? విధిబలం, సృష్టిలో లీలలు - అంటారెందుకు ఈ అమానుష స్థితిగతుల్ని? ఏమైతేనేం, ఏ ప్రశ్నకు ఏ సమాధానం వచ్చినా తను మాత్రం ఒక నిశ్చయానికి వచ్చాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ- ఆ అమ్మాయిని- చచ్చిపోనివ్వగూడదు. ఇంతకీ ఆ యువతిని నిండుగా తనింతవరకూ చూడనేలేదు.

***

వారం, పదిరోజులు గడిచిపోయాయో, లేదో మళ్లీ ఆ మెట్లెక్కుతున్నప్పుడే, వాటి నానుకొనేవున్న చీకటి సామాన్ల గదినుండి మూలుగు వినిపించింది. శాపగ్రస్తమైన శిలవలే నిలిచిపోయాడు. ఆ గదికి గాలివచ్చే వెంటిలేటరు తప్పితే, వెలుగునిచ్చే కిటికీలు లేనట్లు తనకు తెలుసు. వెంటిలేటరు చేతికందే దూరానవున్నా తొంగిచూసేందుకు లేదుగదా అని ఖిన్నుడై చెవినప్పగించేసి వింటూ సందేహం తీర్చుకున్నాడు. అవి ఆ అమ్మాయి మూలుగులే. ఆ సమయంలోనే తన వెనకనే వచ్చి నిలిచిన ముసలవ్వను గూడా అనంతం గమనించలేదు. వృద్ధురాలు చేతి, నోటి సంజ్ఞలతో భాషిస్తున్నది. నిన్న సాయంత్రం నుంచీ సవతితల్లి, ఆ పిల్లను గదిలోవేసి అన్నం, నీళ్లూ అందకుండా బంధించివేసింది.

ఎందుకు? ఏం తప్పు చేసింది?

ఆ పరమాత్ముడికే ఎరిక -ఆకసంవేపు కళ్లు తిప్పింది. అవ్వ- వెళ్లిపోయిందాకా గూడా అనంతం వేచి వుండలేదు. ఉరుకులు, పరుగుల్తో మళ్లీ బజారుకు పోయాడు. రెండు స్వీట్లు, నాలుగు గారెలు, ఒక బన్ రొట్టె కొన్నాడు. ఈ స్వల్ప వ్యవధిలోనే ఆ పిల్ల, ఏ గునపమో, రుబ్బుడుబండో, పాత కత్తిపీటనో దొరకపుచ్చుకొని ప్రాణం తీసుకుంటే? ఇదే ఆలాపనతో పరుగు పరుగున గదికి తిరిగివచ్చి, ఆ పొట్లాన్ని నిశ్శబ్దంగా వెంటిలేటరుగుండా, చీకటి గదిలోకి జారవిడిచాడు. నిమ్మకాయ రసంలో యింత చక్కెరా, చిటికెడు ఉప్పూ కలిపి- తన మరచెంబుకు బెడ్డింగుతాడు బిగించి, అతి నెమ్మదిగా గది చీకట్లోకి ఆ "జైలు" గోడవెంట జారవిడుస్తూ, గోడకి తగిలి శబ్దం చేస్తూంటే మళ్లీ మళ్లీ ఆగి, ఆమె దాన్ని పట్టుకొంటుందా అని సందేహిస్తూ క్షణాలు యుగాలుగా గడిపాడు. హమ్మయ్య- అందుకొన్నది.

ఇంకా అతనికి సంపూర్ణ విశ్వాసం కుదరలేదు. గదిలోకి వచ్చి ఉత్తరమొకటి వ్రాశాడు? ఏమని? ఒకటే వాక్యం- పది విధాలుగా, "చచ్చిపోయే ప్రయత్నం చేయవద్దు. ప్రాణం విలువైనది, ఏ పరిస్థితిలోనైనాసరే, అట్టి తలంపులు దరిచేరనీయవద్దు. అందరికి మంచిరోజులొస్తాయి, తప్పదు. ఆత్మహత్య పాపం, పాపం. ఇంకో జన్మలో యింకా దైన్యం పడవలసి వుంటుంది. పెద్దల మాట."

ఉత్తరంలో ఆమె పేరు లేదు. తెలియదు గదా. తన సంతకమూ లేదు. ఆ అప్రాణిఅయిన కాగితానికి ప్రాణప్రతిష్ట చేసినట్లుగా, వుండచుట్టి కొట్టు గదిలోకి విసిరేశాడు. గుండె అదురు నిలిచి ఒక నిట్టూర్పు విడిచాడు.

అనంతం తన బాల్యంలో తాతగారిని ప్రశ్నించిన వుదంతం గుర్తు కొచ్చి మంచంమీద పడుకొని కళ్లు మూసుకొన్నాడు.

"తాతయ్యా- దేవుడెట్లా కనిపిస్తాడో చెప్పు".

"ఒక ప్రాణిని కాపాడు. ఒక చెట్టును నాటు. అయితే నిష్కామంగా ఆ పనులు చేయాలి. వాటిలో భగవంతుడు కనబడకపోతే మళ్లీ ఆ ప్రశ్న వెయ్యి" అని చెప్పాడు తాతయ్య.

తనది నిష్కామకర్మ అవునో, కాదోగాని, ఆ

రాత్రి హాయిగా నిద్ర పట్టి- ఉదయం పదిన్నర గంటలకి ప్లీడరుగారు డ్యూటీ ప్రకారం కోర్టుకు బయులుదేరుతూ, కూతుర్ని చెరనుండి విడిపించగలిగాడని గ్రహించినప్పుడు నిష్కామంగానే తోచింది. కాని, ఆ పిల్ల... ఆ యువతి... తనను కలిసి మరచెంబునిచ్చి, కృతజ్ఞతా భావంతో మాట్లాడేది ఎప్పుడు అని ఈ వారం రోజులు నిరీక్షించినప్పుడు తనది నిష్కామం కాదని గూడా విచారించాడు. ఆ వారంలోనే అతన్ని చేస్తున్న తాత్కాలికోద్యోగం నుండి తీసివేశారు.

***

మార్గం యింకో సంక్లిష్టదిశకు తిరుగుతున్నదని వరసగా తార్కాణాలు. ఉద్యోగం ఊడటమేగాదు. నీళ్ల బక్కెట్టు తెస్తూ, పని మునలవ్వ మెట్లమీద పడి కాలు విరగ గొట్టుకొని పని మానేసింది. రాత్రిం బవళ్ల అంతరం తెలియకుండా తనైతే పరీక్షలకు చదువుతూనే వున్నాడు. అప్పుడే తనకు విషజ్వరం పట్టుకొన్నది. అప్పటికీ- ఆ అమ్మాయిని తను రక్షించానని తలపోసి రెండు నెలలు దాటుతున్నది. ఏదో ఒక అదనుగల ముహూర్తంలో మెట్లెక్కివచ్చి మరచెంబు తిరిగి యిచ్చే నెపంతోనైనా తనకు కనబడి "మాట్లాడి" పోతుందని నిన్నటివరకూ ఎదురు చూచాడు. ఇప్పుడైతే తన యీ అసహాయ స్థితిలో కనీసం నీళ్లయినా కూజాలో నింపిపోతే చాలునని అనుక్షణమూ ద్వారాన్ని చూస్తూనే వున్నాడు. గది మాట్లాడుకొన్నరోజు ఒప్పందం ప్రకారం- కుర్ర కారు స్నేహితుల్ని- పిలుచుకు రాకూడదు గదా. వున్న ఒకరిద్దరు దోస్తులకు యీ చిరునామా కూడా తెలియదు.

ఈ మూడు రోజులైతే కటిక వుపవాసమే. ఒడలంతా జ్వరవాసన. తన గుడ్డలూ, మంచమూ, శరీరంతోపాటు విషజ్వరాన్నీ పంచుకొంటున్నవా? తూలుడు... తూలుడు. లేవలేక మగతలో పడిపోయాడు. ఆ మురికి గది విష వాతావరణంలో గడిపింది ఎన్ని గంటలో, పూటలో, దినాలో కాలమానం తెలియడంలేదు. ఏ లోకంలో వున్నాడో, అసలు వున్నాడో లేడో?

ఉన్నాడని నిరూపించడానికన్నట్లుగా, మేజాబల్ల మీది టైమ్‌పీస్ అలారం కొడుతుంటే, దీర్ఘనిద్ర నుండి మెళకువ వచ్చినట్లుగా లేచి కూచున్నాడు. సన్నటి తూలుడింకా వదలకపోయినా, మెదడు పనిచేయసాగింది. తనకెప్పుడూ అలారం యిచ్చే అలవాటు లేదుగదా. కొత్త పరిసరాల్లో వున్నట్లు, ఒళ్లు తేలికైపోతున్నట్లూ, శరీరం సువాసనలు చిమ్ముతున్నట్లూ... ఓపిక ఏ దిశనుండి వచ్చి వరించిందో మంచం దిగిపోయాడు. గది శుభ్రంగా వూడ్చి వుంది. చాకలి వుతుకు మడతల్లో వున్న రెండు దుప్పట్లూ, రెండు తుళ్లూ, దిండు గలీబూ, ఇస్త్రీ చేసి పేర్చి వున్న తనిష్టపడే తెల్ల షర్టులు. కూజా నిండా నీళ్లు, గడియారం ముందు తన మరచెంబు, తోమి కళకళలాడుతూ. ఆదరాబాదరా వణికిపోతూన్న చేతులతోనే మరచెంబు ఎత్తి చూశాడు.

గోరువెచ్చకన్నా కొంచెం వేడిగా కాఫీ అవురావురామని గడగడా త్రాగేసి, శతాబ్దాల క్రితం ఒక గ్రామీణ స్త్రీ, శోష వచ్చి పడిపోయిన సిద్ధార్థ గౌతముడికి నీరూ, గోక్షీరం యిచ్చి అతని ప్రాణాలు కాపాడిన వుదంతాన్ని స్మృతికి తెచ్చుకొన్నాడు. కాని తనకు ప్రాణధారను అందించిన యువతి ఇంకా అదృశ్యదేవతే. రుణవిముక్తి ప్రధానంగాని దర్శన సౌలభ్యం ఎందుకనుకొన్నదో లేక సవతి తల్లి భయం వల్లనో, తన కంటపడలేదు.

***

జీవనగతి కంటక మార్గంలోపడింది గదా. అతని ఉద్యోగ ప్రయత్నాలేమీ ఫలించక, తను రాసిన పరీక్షల మీద ఆశ మృగ్యమై, ఎవరెవరికో వుత్తరాలు పోస్టుచేసి, ఎటునుండి జవాబులు రాక నిస్పృహ లోయల్లోకి జారిపోయి మనసులో చీకటిని, హృదయంలో చీకటిని దూసుకురాలేని ఆశాకిరణాలకై వేచి చూసి, పూర్ణసుఖం కోసం, పూర్ణ జీవితం కోసం, పూర్ణ జ్ఞానం కోసం మానవుడు ప్రయాసపడటం వృథా అనే నిశ్చయానికి వచ్చాడు. ప్లీడరుగారు- తన అద్దెడబ్బుల్తో ఒక ఖర్చును గడుపుకొంటున్నవాడు. ఆ నెల వూరుకొన్నా, ఈ నెల వుదాశీనం వహిస్తాడా? రేపు మాపు అని అసత్యాలు పలికి, అవి తనకు కనిపించక పాత పత్రికలో "ఎవరు? ఎందుకు? ఏమిటి?" అనే నిరుద్యోగి దీర్ఘ గాథ చదివి, ఆ కథానాయకుడి ఆలోచనా వ్యాసంగపు ముగింపు పరిష్కారానికి ఆశ్చర్యపోయాడు. తన గదిలో మిగిలి వున్న చిల్లర నోట్లను లెక్కించుకొన్నాడు. తిండి మానుకొన్నాడు. చెప్పులరిగేటట్లు తిరిగాడు. తన పాత స్నేహితుడి అన్నగారు డాక్టరు క్రిష్ణతో, ఎన్నో రోగాలు లేనివి వల్లించి చెప్పుకొని, మేనత్తకని బొంకి, పది నిద్రమాత్రలు ఆర్జించుకొని తిరిగి గూటికి చేరాడు. సగం మాత్రకన్నా ఎక్కువ వాడొద్దు. అని వున్న ప్రి స్క్రిప్షన్ కాయితం మీది అస్పష్టాక్షరాలు చదివి దాన్ని తిప్పి వేశాడు. ఎన్నడూ లేనిది అప్పుడే వినవస్తూన్న భక్తిగీతాలు విని, ఎంత చక్కని నేపథ్యం యీ నాటక సమాప్తికి అని గూడా తలపోశాడు.

పది నిద్రమాత్రల్నీ పిండి చేసి గాజు గ్లాసు నీటిలో నెమ్మదిగా మిళితం చేశాడు. ఒక ప్రాణం లేని గాజుగ్లాసు మానవుడి నిరంతర భౌతిక ఆధ్యాత్మిక కల్లోలాలకు ఎంత సులువుగా పరిష్కార మార్గం నిర్దేశించగలదో గదా.

పది నిద్రమాత్రల్నీ పిండి చేసి గాజు గ్లాసు నీటిలో నెమ్మదిగా మిళితం చేశాడు. ఒక ప్రాణం లేని గాజుగ్లాసు మానవుడి నిరంతర భౌతిక ఆధ్యాత్మిక కల్లోలాలకు ఎంత సులువుగా పరిష్కారమార్గం నిర్దేశించగలదోగదా. చావుకు సిద్ధంగా వున్న వాళ్లకు ఒకటి రెండు వుద్ధరిణెల తులసి తీర్థం యిస్తారు గదా. ఆ తంతు కళ్లకు కట్టింది. అప్పగింతలు. ఓపిక వుంటే అప్పుడే ప్రారంభమౌతాయి. తన అప్పగింత. ఒక చిన్న ఉత్తరం. అది పూర్తిచేసి ఆ తులసి తీర్థం సేవిస్తే, ఈ అనంత శూన్య పథికుడు చివరి మజిలీ చేరుకున్నట్టే గదా.

ఉత్తరానికి సాంప్రదాయ పద్ధతిలో శ్రీకారంచుట్టి, నేపథ్యగానం వింటూనే, దీర్ఘమా, హ్రస్వమా- ఈ తుది జాబు రూపు అన్న అనమాన వీచికలను ఆహ్వానించాడు. "నా చావుకు ఎవరూ బాధ్యులు కారు, నా సామాన్లనమ్మివేసి, రెండునెలల గది అద్దె చెల్లించి వేస్తే నేనెవరికీ బాకి వుండను- అనంతం."

నవ్వు వచ్చింది చావు వుత్తరానికి శ్రీకారం చుడితే శుభగ్రహ వీక్షణం వస్తుందా? అనంతం అంటే అంతం లేనివాడు గదా? వాడు అంతిమ జాబును వ్రాయటం ఎంత హాస్యాస్పదం? చింపివేశాడు.

గ్లాసు ఎత్తుతూంటే హస్తం వణుకుతూన్నదేమోనని ఆందోళన జనించి, ప్రయత్న పూర్వకంగా దాన్ని ఎడమచేత్తో అదుపుచేశాడు. గ్లాసును పెదిమలకు తాకిస్తూ, ఎందుకో అద్దంలో తన ముఖకవళికలను చూచుకొన్నాడు. ఆహా, యీ చరమాంకంలో నటుడికి ఎంత నిబ్బరం- "విషపాత్రతో

విషాదజీవి." కవితాధోరణి. "ఇది మృత్యు గహ్వరం కాదు మాతృమందిరం" మొదటి చరణం పలికింది.

అప్పుడు వినవచ్చిందొక అపస్వరం, ఎన్నడూ వినని కిర్రుమన్న తలుపు. అప్పుడే కనిపించిందొక ఛాయ. ద్వారం తెరుచుకొని ఆ అమ్మాయి, నిశ్శబ్దంగా, వేరొక ఆకసం నుండి జారిపడిన ఉల్కవలే వచ్చింది. అతని చేతిమీద గట్టి దెబ్బవేసింది. గాజు గ్లాసు విసురుగా నేలమీద పతనమై చేసిన శబ్దమే, ఆ గదిలో ప్రథమ సంభాషణ. అనంతరం ఆమె ముఖంలోకి చూడజాలక నిల్చుండిపోయాడు.

"ఇది చదువుకోండి" ఆ మృదుస్వరంలో కోపం లేదు. కంగారు లేదు. కఠినత్వ మసలే లేదు.

ఆ కాగితం, తను ఆమెకు కొన్ని నెలల క్రితం వ్రాసిన ప్రబోధం ఉండగా చుట్టి చీకటి గదిలోకి విసిరివేసిన ఆ అప్రాణి. తనదస్తూరి. కాని ఆనాడు తను సంతకం, పేరు లిఖించలేదు. ఆ జాబుకు నిండు ప్రాణంపోస్తూ యిప్పుడొక సంతకం- "సీత". "చచ్చిపోయే ప్రయత్నం చేయవద్దు. ప్రాణం విలువైనది. అందరికీ మంచిరోజులొస్తాయి... సీత"

అనంతానికి అప్పుడప్పుడు లాటరీ టిక్కెట్లు ఒకటీ అరా కొనే అలవాటున్నది. మేజా మీదవున్న ఆ టిక్కెట్టును పైకెత్తి చూపుతూ "ఈ లాటరీ యింకా తీయలేదు. ఒక వారం టైమున్నది." అన్నది. అన్నది నిష్క్రమించింది. ఇందాకటి నేపథ్యగానం గూడా ఆగిపోయింది. ఇంతకీ ఆమెను, ఆ సీతను, ఆ జానకిని తను ఆపాదమస్తకం చూడనేలేదు.

ఒక ప్రభంజనపు విసురో, ఒక మలయ మారుత పవనమో గదిలో జొరబడి కిటికీ గుండా మళ్లీ నిష్క్రమించినప్పుడు, మనకు ఆ రూపం కనిపిస్తుందా? యవనిక జారినపుడు రంగస్థలం మీది నటులను చూడగలమా? ఇంకేం చూడగలడు? రమణ మహర్షివలే తనను తనే చూచుకోమన్నది గదా! ఆ సీతాదేవి?

ఆ వారంలోనే అనంతం, రెండుసార్లు తను చచ్చి బతికిన ఆ గది ఖాళీచేసి వెళ్లిపోయాడు. బహుశః కొద్దో గొప్పో ఆ లాటరీ తగిలి వుండవచ్చు. మరి ఆ వూరు నుండే తరలిపోయాడు గదా.

***

"కథ ముగిసిందా?" అని నేనడిగాను. ఎందుకంటే ఒక సన్నని జల్లు పడవచ్చునేమోననే అనుమానం ఆ మునిమాపు



ఆకాశం అంకురింపజేస్తున్నది. పారిజాతాల మత్తువాసన పత్తుగా వస్తున్నది అందుకు సూచనగా.

జగన్ ఒక నిట్టూర్పు విడిచి అన్నాడు.

"ఎట్లా ముగుస్తుంది" అసలు కథాభాగం దాని తాత్విక విచారణ ఇప్పుడే ప్రారంభం."

అని తిరిగి ప్రారంభించాడు.

ఆ సంవత్సరంలోనే- అనంతం తను వెనుక వ్రాసిన పెద్ద పరీక్షలో ఉత్తీర్ణుడై పెద్ద ఉద్యోగంలోనే చేరాడు. అతనికి మొదటి జీతం అందింది. ప్రప్రథమంగా చేసిన పనేమిటో వూహించగలవా? ఒక పెద్ద వెండి కుంకుమ భరిణె కొన్నాడు. అది మంగళదాయకమైన చిహ్నం కదా. అది పుచ్చుకొని హుటాహుటీ సీత వాళ్ల పట్నానికి వెళ్లాడు. వాళ్లింటికే, నేరుగా. ముసలి ప్లీడరుగారు బయటనే కనిపించాడు.

"నేను యిదివరలో మీయింటి పైగదిలో అద్దెకుండేవాణ్ణి" అని పరిచయం చేసుకొన్నాడు.

ఆయన పరికించి చూచి, జ్ఞప్తికి తెచ్చుకొని.

"అవును, జ్ఞాపకమే. కాని ఆమె ఆత్మహత్య చేసుకొని చచ్చిపోయింది." అని నిర్లిప్తంగా అన్నాడు.

అనంతం -ఆ మాటల్లోని భయంకర వార్తను విన్న తర్వాత, ఏమని తన హృదయాన్ని సరిపెట్టుకొన్నాడో అతనికే తెలియాలి. నీవూ, నేనూ వూహించలేముగదా. సీతా- తన కానాడు ఆ లాటరీ టిక్కెట్టును చూపి, ఎట్లా ఆశీర్వదించిందో, తను- యీ వెండి కుంకుమ భరిణెనిచ్చి ఆమె కల్యాణం కోసం ఆశీర్వదిస్తే- ఆ యమ చెరనుండి విముక్తి పొందుతుంది గదా అనుకొన్నాడు, గాని యీ ఘోర వార్త వినవస్తుందని తలపోసి వుండడు గదా. ఏమైతేనేం ప్లీడరుగారి చేతిలో ఆ కుంకుమ భరిణెను పెట్టి అనంతం వెనుదిరిగిపోయాడు.

***

ఇందాకటి నుండి భయపెడుతున్న జల్లు నిజంగానే ప్రారంభమైంది. మేము మెట్లుదిగి కింది హాల్లోకి వచ్చేశాము.

"జగన్, నిజంగా హృదయం గాయపడే కథ చెప్పావు, బాగానే వుంది. నీ కథా ప్రవచన నైపుణ్యం. కాని నువ్వు పోలీసు వుద్యోగానికి పనికిరావురా" అన్నాను.

జగన్ మొదటిసారిగా నవ్వేశాడు. నీతో అన్న మాటలు స్మృతికి తెచ్చుకో. ఆమె ఆత్మహత్య చేసుకొన్నదనిగదా అన్నదాయన? "ఆమె" సీతే ఎందుకుకావాలి? ఆమె సవతి తల్లి కావచ్చు గదా?" అని ఆ ప్రశ్నకు ఎదురు ప్రశ్న వేశాను నేను.

"అంటే సీత క్షేమంగా వుంది. ఆ కుంకుమ భరిణె మీద "ప్రాణదాతకు" అనే అక్షరాలు వున్నయ్యా లేవా?" అని మళ్లీ అడిగాను.

"ఉన్నయ్. నీకెట్లా తెలుసు?"

"తెలిసేందుకేమీ లేదు. ఆ అనంతానివి నువ్వే గనక. నీ తర్వాత ఆ గదిలో అద్దెకు దిగింది నేనే గనక".

జగన్ ఎగిరి గంతేశాడు. ఆ గంతువెయ్యటంలో ఎదురుగా వున్న నిలువుటద్దం కొద్దిగా అదిరింది. దాని ముందున్న వెండి కుంకుమ భరిణెగూడా అదిరి, వాడి కంటబడ్డది.

"ఒరే, ఒరే. సీతను నువ్వు చేసుకొన్నావా?" అని అమాంతం నన్ను పోలీసు పుక్కు బంధంలో బిగించివేశాడు.

"ఇంకా సందేహమా?" అన్నాను నేను.

"కాదు. ఇంకో సందేహం" అన్నాడు.

"ఏమిటో?"

"మరి 'ఆమె' -ఆ సవతి తల్లి ఎందుకు ఆత్మహత్య చేసుకొన్నట్టు?"

"సవతి బిడ్డకోసం కలిపిన విషం పాలగ్లాసును పొరబాటున తనే గ్రోలినందుకు. ఇది ఒక పెద్ద పోలీసాఫీసరుకు రాదగిన సందేహమేనా? నీకెందుకురా యీ ఉద్యోగం."

"అందుకే గదా నేను రాజీనామా చేసి వచ్చింది" అని జగన్ ముగించాడు.

***

తను ముగించాడుగాని, సీతకూ నాకూ యిప్పుడో పెద్ద బాధ్యత నెత్తిన పడ్డదని మీరూ గ్రహించివుంటారు.

ఈ బట్టతల పెద్ద మనిషికి మేమింకా పెళ్లి సంబంధాలు చూస్తూనే వున్నాము. వధువుల తల్లిదండ్రులు ముందుకొస్తున్నారు గాని వధువులే యిష్టపడటంలేదు. మీ ఎరికలో ఎవరైనా వుంటే ఎడిటర్ చిరునామాకు వ్రాస్తారు గదూ.

■